చాలాకాలం తరవాత కనిపించిన స్నేహితురాలి నవ్వు వెనక దాగిన అర్థం పరమార్థం?



# ఆమె నవ్వు

బి. ఎస్. సోమయాజులు

"మీరేనా. రామారావుగారంటే?" తన ఆఫీసు రూంలోకి అడుగుపెట్టిన ఆగంతకుణ్ణి ప్రశ్నించాడు సాంబశివం.

"అవునండి."

"అలా కూచోండి! తన టేబిల్‌కి దగ్గర్లో ఉన్న విజిటర్స్ ఛైర్ చూపించి అటెండర్‌ని పిలిచి కాఫీ తెమ్మన్నాడు.

రామారావు మొహమాటపడ్డాడు. "ఫర్వాలేదండీ ఎలాగూ నా కాఫీ టైమ్ అయింది. ఇంతకీ మీరేదేనా అర్జంటు పనిలో వున్నారా.... లేక లంచ్ టైంలో ఎక్కడికైనా బయటకు వెడతారా?" అనడిగాడు సాంబశివం.

"అబ్బే లేదండీ. బైటికి వెళ్ళే పని లేదు. ఏదో ఇంటి దగ్గర్నుంచే టిఫిన్ తెచ్చుకుంటాను. అదీ కానిచ్చేను లెండి!"

"సరే - మీ గ్రాడ్యుయేషన్ దేన్లో? ఐ మీన్, మీ సబ్జక్టు?"

"ఆర్ట్సులెండి" అని నీళ్ళు నమిలేడు, ఏదో మహాపరాధం చేసినవాడిలా.

"ఆహాఁ మరేంలేదు, మా పిల్లలిద్దరు సెకండరీ కోర్సులో వున్నారు. మీ హెల్ప్ కావాలి. మీరు అక్కడా అక్కడా ట్యూషన్స్ చెబుతున్నారని తెల్సింది. మా పిల్లలు అంటే, ఒకమ్మాయి, అబ్బాయి, అంత వీక్ కాదుగాని, ఈ ఏడాది రెగ్యులర్ కోచింగ్ వుంటే కాస్తమంచి మార్కుల్తో పేసవుతారని, లేకపోతే చూశారూ, అత్తెసరు మార్కులు రావడం, ఆ మార్కులు టెక్నికల్ కోర్సులకి పనికిరాకపోవడం. మళ్ళా వీళ్ళు ఏ ఆర్ట్సుగాని, కామర్స్‌గాని తీసుకోవడం, దానాదీనా టైమ్ వేస్టూ. ఇంకో లైన్ ఆఫ్ లైఫ్‌లో పడడం, అందుకని ఆలోచిస్తున్నాను. మీకేమైనా ఆటంకా లున్నాయా?"

రామారావు ఆలోచించాడు. తనకి వీలుగానే ఉంటుంది. ఈయనవుండే ఆఫీసర్స్ కాలనీలోనే రెండు ట్యూషన్స్ వున్నాయి. అంచేత పెద్ద టైము వేస్టుకాదు అదే చెప్పాడు.

"గుడ్! అలా అయితే సాయంకాలం ఓసారి అటురండి! మా పిల్లల్ని చూద్దురుగాని.

అలాగే వెళ్ళాడు రామారావు సాంబశివం ఇంటికి, గేటు తీసుకుని లోపలికి వెళ్ళి బజ్జర్ నొక్కితే "కమింగ్ ప్లీజ్!" అం ఓ తియ్యటి స్వరం బదులు వచ్చింది. మరి కాస్సేపట్లో తలుపులు తెర్చుకున్నాయి. లోపల అడుగుపెట్టాడు మెత్తటి తివాసీ ఆప్యాయంగా తన పాదాల్ని స్పృశించింది.

"అలా కూర్చోండి," కనిపించీ కనిపించకుండా ఆమె లోపలి తెరల్లోకి అదృశ్యం అయింది. ఆ స్వరఁ రామారావులోని భావుకుణ్ణి ఏలోకాలకో తీసుకుపోయింది.

టీపాయ్‌మీద ఆనాటి దిన పత్రికలు. న్యూస్ వీక్ ఇంకా కొన్ని మేగజైన్లు. ఆలోచిస్తూ తిరగేస్తున్నాడు అక్కడక్కడ చదువుతూ.

"ఎక్స్‌క్యూజ్ మీ"-అంటూ ఓ పదహారేళ్ళమ్మాయి రెండు చేతుల్తోనూ పెద్ద ట్రే తెచ్చింది. రెండు మూడు రకాల బిస్కెట్లు, కాఫీ ఉన్నాయి.

నిర్ఘాంతపోయాడు ఆ అమ్మాయిని చూసి. ఎవరో బలవంతంగా అప్పటి కప్పుడు ఇరవై యేళ్ళు వెనక్కి తీసికెళ్ళినట్టు ఫీలయ్యాడు. వసంత! తను! ఏమిటిది. ఎక్కడున్నాడు తా నిప్పుడు.

"ప్లీజ్!"....అతని నివ్వెరపాటును ఎలా తీసుకోవాలో తెలియక మూఢురాలివలె అన్నది, ఆ అమ్మాయి. దానితో పూర్తిగా తేరుకుని 'థాంక్యూ' అని సాదరంగా నవ్వుతూ పలకరించాడు.

"నాన్నగారు లేరా?" అనడిగాడు.



ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవి కళాప్రపూర్ణ డాక్టర్ దాశరథిని స్పందన సాహితీ సమాఖ్య, మచిలీపట్నంవారు సన్మానించినప్పటి దృశ్యం. ప్రక్కన కూర్చున్నవారు సుప్రసిద్ధ కథారచయిత శ్రీ కాళీపట్నం రామారావు, స్పందన అధ్యక్షుడు శ్రీ విహారి.

"లేరు, టెన్నిస్‌కి వెళ్ళారు" అని కాస్సే పాగి "మీరు వస్తారని చెప్పారు...." అంది అతని సందేహాన్ని తీరుస్తూ.

"కాఫీ తీసుకోండి!" అని, లోపల్నుంచి "పద్మా!" అని పిలుపు రావడంతో "ఇప్పుడే వస్తాను;" అంటూ లేచి లోప లికి వెళ్ళింది.

ఆ నడక, పొడుగాటి జడ కనుసొంపుగా కదుల్తూవుంటే "అచ్చు వసంతే" అని పించింది. ఈ మె తల్లి నిజంగా ఆ వసంతేనా? ఈ అమ్మాయి కొంపదీసి వసంత కూతురు కాదు కదా?

ఇలా మార్చి మార్చి అనుకుంటున్నాడు. తనకి నవ్వొచ్చింది. ఏం, ఎందుక్కా కూడదూ? – బుచ్చిబాబు రాసిన కథ 'మేడ మెట్లు' గుర్తుకొచ్చింది.

* * *

ఓ నెల గడిచింది. ఈ ముప్పై రోజుల కాలంలోనూ రామారావుకి ఆ యింటితో చాలా దగ్గర సంబంధం ఏర్పడిపోయింది. కనీసం అతనలా ఫీలయ్యాడు. పద్మ టెన్త్ క్లాసు, ఆమె తమ్ముడు సతీష్ ఎనిమిది చదువుతున్నారు. తనకి సులువుగా ఉంటుం దని ఆ దగ్గర్లోవున్న ఇద్దరు పదో క్లాసు స్టూడెంట్స్‌ని కూడా ఈ యింటికే రప్పించు కొని ఒకే టైములో ట్యూషన్ చెబు తున్నాడు. అందరూ ఇంగ్లీష్ మీడియం లోనే వుండడంచేత తనకి సులువుగావుంది చెప్పడం. ఏదైనా ఇట్టే గ్రహిస్తున్నారు. తనకి రిపిటిషన్ సమస్యలేదు.

మొదటినెల కాగానే సాంబశివంగారు తనని డ్రాయింగ్ రూంలోకి పిల్చి ఏభై రూపాయిలిచ్చారు. "అవ్వే ఎందుకండీ"–" అన్నాడు తను. ఎంతైనా అతను తన డిపార్టుమెంటులో డిప్యూటీ సెక్రటరీ. వారి పిల్లలకి చదువు చెప్పినందుకు డబ్బు తీసుకోవడం అంటే ఎబ్బెట్టుగా అనిపిం చింది.

"అదేమిటోయ్! అడగ్గానే వచ్చి చెబు తున్నావు. మా పిల్లల చదువు సార్థకం అవాలంటే కాదనకూడదు....నిజానికి ఇంతకి రెట్టింపు ఇవ్వాలి, మా పద్మ ఇచ్చిన రిపోర్టుకి." అంటూ నవ్వారాయన.

"పద్మ రిపోర్టా?"

"అవును–నువ్వుచాలా ఎంథ్యూజియాస్టి క్‌గా చెబుతావట. ఒకసారి చెబితేనే అర్థమయి పోతుందట. ఆఫీసులో నీపై రాస్తున్న సి. ఆర్. (కాన్ఫిడెన్షల్ రిపోర్టు) లాగే ఇక్కడా బావుంది!" అంటూ జోక్‌గా మాట్లాడడం మొదలుపెట్టారు.

"కాని సర్...."

"నెవర్ మైండ్. టేకిట్...., టేకిటీజీ!"

ఓ పది రోజుల తరువాత మామూలు వేళకి ఆ ఇంట్లో అడుగు పెట్టిన రామా రావుకి రోజూ మాదిరి అనిపించలేదు. అంత నిశ్శబ్దంగా ఉన్నది. సోఫాలో కూర్చుని పేపరు చూస్తున్నాడు.

మామూలుగా వచ్చే కాఫీకూడా రాలేదు. మెయిడ్ సర్వెంట్, పిల్లలు ఏమయ్యారు చెప్మా; అవతల ఇళ్ళలోని స్టూడెంట్స్ వూరెళ్ళి వారం అయింది. వాళ్ళెలాగా రారు. ఇంత నిశ్శబ్దంగా ఉందేమిటో. ఆ యింటికి తనొచ్చిన మొదటి రోజు కూడా ఇంత కొత్తగా ఫీలవలేదు.

లేచి పచార్లు చెయ్యడం మొదలెట్టాడు.

యాదృచ్ఛికంగా అతనలా ఆ కిటికీ వేపు తిరిగేసరికి అవతలి గదిలోని వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయాడు.

వసంత!

నిజంగా వసంతేనా? పద్మ నిజంగా వసంత కూతురేనా? ఇన్ని రోజులూ తనని ఏదో సమయంలో ఈ ప్రశ్న నిలవేస్తూనే వుంది. కాని కనిపించని గోడలేవో అడ్డు తగుల్తూ ఆ ప్రశ్న సప్లిమెంటరీస్‌తో సహా వెనక్కి వచ్చేస్తోంది.


(5000/- ఆకర్షణీయమైన బహుమతి గెలవండి!)

దీపావళి బంపర్ ఆఫర్ ఎంట్రీ ఫీజు లేదు.

బహుమతులు : వాచ్, కెమేరా. టేప్‌రికార్డర్. రికార్డ్ ప్లేయర్, జపాన్ మోడల్ ట్రాన్సిస్టర్‌లలో ఒక బహుమతి. కన్సొలేషన్ బహుమతి : అమెరికన్ డిజైన చీరె ధర రు. 120/-లో సగం రు. 60/-. మొదటి బహుమతి ఇతర వాటితో వేరుగావున్న దానికి ఇవ్వబడును. అదే విధంగా వున్నదానికి కన్సొలేషను బహుమతి ఇవ్వబడును. ఇది అమ్మ కం అభివృద్ధి పథకం. ప్రమోటర్ల తీర్మానం ఖాయమైనది మరియు చట్టబద్ధమైనది.

| | | | |
|---|---|---|---|
| 10 | 15 | 8 | 13 |
| 19 | 4 | 17 | 6 |
| 12 | 11 | 14 | 9 |
| 5 | 16 | 7 | 18 |

నిబంధనలు : తెల్ల కాగితముపై పదహారు గడులను నమూనాలో ఉన్న విధంగా తయారుచేసి 5 నుండి 20 వరకుగల అంకెలను ఒకసారి మాత్రమే వాడి మొత్తం 50 రావలయును. 2. బహుమతి గెలిచిన వారికి పోస్టేజి, ప్యాకింగ్ మొదలగు ఫీజులు చెల్లించుటకు తెలియ పర్చబడును. 3. ఒక కుటుంబం ఒక ఎంట్రీ మాత్రమే పంపాలి. మా కార్యాలయమునకు మొదటగా చేరిన ఎంట్రీకు స్పెషల్ బహుమతిగా రు. 101/- నగదు ఇవ్వబడును. 5. ఎంట్రీలు హిందీ లేక ఇంగ్లీషులో మాత్రమే పంపాలి. సహాయమునకు 46

ఆఖరి పోస్టింగ్ తేదీ : 26-11-77

ATLAS TEXTILES (AJW-50) P. B. No. 95, ALIGARH-202001

సంప్రదాయ మాధురి

## మందార మకరందాలు

శ్లో॥ సంహతిః శ్రేయసీ పుంసాం। స్వకులై రల్పకైరపి।
తుషేణాఽపి పరిత్యక్తా। న ప్రరోహంతి తండులాః॥

ఎంతవారైనా స్వకీయులైన అల్పజనులతో కలసివుండుట మేలు. బియ్యం పై పొట్టు తీసివేయగానే దానికి మొలకెత్తే జీవశక్తి లోపించడం చూస్తున్నాముకదా!

కంఠస్థం చేయాలి

ఒక్కొక్కప్పుడు అనిపిస్తుంది, వసంత తండ్రి చూస్తే పెద్ద స్థితిమంతుడేం కాదు. అప్పట్లో తను పుట్టి పెరిగిన వూళ్ళో ఓ ప్రెస్‌లో మేనేజర్‌గా వుండేవాడు. ఆ ప్రెస్ కాస్తా మూతపడిపోగానే సొంత వూరికి తరలిపోయాడు. అలాంటివాడు వసంతకి ఇంత మంచి సంబంధం తేగలిగాడంటే వసంత అదృష్టం అనే చెప్పాలి.

ఆమె కాదేమో- తిరిగి సోఫాలో కూచుని తీసిన పేపరే తీసి చూసిన వార్తలే చూస్తున్నాడు. మనోనేత్రానికి కనిపిస్తున్న రూపాన్ని మనస్సు సందేహిస్తోంది.

ఎవరో వస్తున్న సవ్వడి, అటు తిరిగి కొద్దిగా వోరగా చూశాడు. ఆమె రెండు చేతుల్తో ట్రే-అలవాటు లేదేమో, పాపం, అడ్డు తగుల్తున్న తెరని బుజాల్తో తప్పించడానికి అవస్థపడుతోంది. పాపం అనిపించింది అతనికి. అనుకోకుండా లేచివెళ్ళి అందుకున్నాడు. కొంచెం భయపడుతూనే. "సారీ.... ఎందుకింత శ్రమ....పిల్లలేరి" అన్న మాటలు అతి నెమ్మదిగా తప్పనిసరిగా వస్తున్నట్టు వచ్చాయి, అతనినుంచి.

"పర్వాలేదు. పిల్లలీవేళ అనుకోకుండా ఓ ఫంక్షన్‌కి వెళ్ళారండి - మీరు కాఫీ తీసుకోండి" ఎంతో మర్యాదగా అని ద్వార బంధాన్ని ఆనుకొని నిలబడిందామె.

అతను "ఆజ్ఞ" అన్నట్టుగా బుద్ధిగా కూచుని కాఫీ తాగేడు. తన ఇరవై ఏళ్ళ సర్వీసులో అత నెప్పుడూ ఎలాటి వాళ్ళకి ఎదురు చెప్పలేదు. ఉద్యోగంలో చేరడం స్వతంత్రం వచ్చేక అయినా ఇంపీరియల్ గవర్నమెంటు వారు తమ యిష్టాలకి అనుగుణంగా కల్పించిన పద్ధతుల్లోనే ఇంకా నడుస్తున్న ఆఫీసులో పని చేస్తున్నాడు.

కాఫీ తాగేక లోపలి సంఘర్షణను జయించినట్టు ఫీలయి ఆమె వేపు చూశాడు. చిత్రం! అలవోకగా నిలబడిన ఆమె తననే, చిన్న విలాస చిహ్నమైన చిరునవ్వును పెదాల మీద వుంచుకుని మరీ చూస్తోంది తనవైపే.

నిజమా?

అతను ఎందుకేనా మంచిదని నెగెటివ్‌గా ఆలోచిస్తాడు. జీవితం నేర్పిన పాఠం అది. "కాదు" అనుకొన్నది "అవును" అయితే



ఉచితము : ఉచితము :

## తెల్ల మచ్చలు

మా చికిత్స ప్రారంభించగానే మచ్చల రంగులో మార్పు వస్తుంది. పరీక్షించి మా మందు ఎంత పని చేస్తుందో చూడండి. రోగి వివరాలు వ్రాసి ఉచితంగా ఒక పాకెట్ మందు పొందండి.

LALIT AYURVEDIC PHARMACY (AJ)
P. o. Katrisarai (GAYA)

## బోరోక్రీమ్

యాంటీసెప్టిక్
పర్ఫ్యూమ్డ్
క్రీము




ఈ యాంటీసెప్టిక్ లేపనము ఉదయము. సాయంత్రం రాసుకొనిన ఎడల, మీ చర్మానికి పోషణ కల్గించి, మెత్తగా, మృదువుగా వుంచి, మచ్చలను మరియు అంటు రోగములను మటు మాయంచేస్తుంది. ఇది సువాసన, పూలవంటి తాజాదనాన్ని రోజంతా మీకు కల్గిస్తుంది.

ఫార్మా మెడికో (ఇండియా) ప్రై. లి.
బొంబాయి-400060

RPC-TEL 4236/76

అన్నిచోట్ల లభించును.

అది సహజంగా కంటె అదనపు ఆనందాన్నిస్తుందని అతని వూహ.

మళ్ళా పోమారు. ఆమె తననే పరిశీలిస్తోందని తెలిసినా చూశాడు చూడకుండా వుండలేక.

వసంతే!

ఆ పెదవులమీద వుండే మినిమమ్ స్మైల్ ఇంకెవరికుంటుంది? ఇరవై ఏళ్ళు కాదు. మరో అన్నాళ్ళయినా తను మర్చిపో గలడా!

"వసంతా!"

"ఆఁ వసంతనే-ఏం? అంత మారిపోయానా?....నువ్వేమీ చెక్కు చెదరకుండానే వున్నావు...బావున్నావా, రామం?"

"ఎంతమంచి రోజు! ఎన్నాళ్ళయింది నీ-సారీ-మీ గురించి అసలేమీ తెలిసింది కాదు. ఎన్నేళ్ళకి కనిపించారు! అదీ ఇంత మంచి పొజిషన్ లో-నా హార్టీ కంగ్రాట్స్"

"బి స్లో-మరీ అంత ఎక్సైటయిపోకు! ఆ మే లక్కీ-నీ సంగతి చెప్పు?"

"నా సంగతు లేముంటాయ్? ఏదో సాధారణంగా అతి సాధారణం అంటారే-అల్లా - ఎ డ్రాప్ ఇన్ ది సీ"

"సరేలే, అంతడాషింగ్ యంగ్మాన్ వి ఇంత డీలా అయిపోయావేం? - బి నేచురల్!"

గతంలోకి అనుకోకుండా దిగి పోతున్నాడు.

ఒకే క్లాసులో వుండే వారిద్దరూనూ, మార్కులు పోటీ పడి తెచ్చుకునేవారు. ఎదుగుతున్న వరువం, మనస్సులూ-అన్నీ అంత స్పష్టంగా తెలీకపోయినా వసంత అంటే తనకి అంతులేని ఇష్టం అన్న సంగతి మాత్రం నిస్సందేహంగా తెలిసేది. వాళ్ళు అద్దెకుండే యింటివాళ్ళకీ తనకీ వుండిన చుట్టరికాన్ని ఆధారంగా చేసుకొని వసంతకోసమే ఆ యింటికి తరచూ వెళ్ళేవాడు. ఎప్పుడు వెళ్ళినా మాట్లాడుకునేవాళ్ళు - చదువు గురించి, క్లాసులోని ఇతర విద్యార్థుల గురించి ఎంతో ఫ్రీగా చెప్పుకునేవాళ్ళు.

ఎంత చొరవగా వుండేదనీ-అంతా అమాయకమే. తనంటే ఎంత నమ్మకం! ఆ నమ్మకం కుదుర్చుకోడానికి ముందు ఎన్నో పరీక్షలకి గురిచేసింది. తను అన్నిటికీ నవ్వుతూ నిలబడ్డంతో మంచి ఫ్రెండయిపోయింది.

కాని కాలగమనం తెచ్చిన మార్పులు వారి స్నేహానికి అంతరాయ మయ్యాయి-క్షణాల్లో విడిపోయిన రెండు రైళ్ళలా....

"మీరీవూరొచ్చి ఎన్నాళ్ళయింది?" ఆమే అతన్ని గత స్మృతుల లోయల్లోంచి బయటకు లాగుతూ అడిగింది.

"పన్నెండేళ్ళయింది. నా మేరేజ్ ఇక్కడికి రొచ్చాకే అయింది." అని ఆమెకేసి చూసి "ఎంత ప్రయత్నించినా మీ సంగతులు తెలియనేలేదు!" అన్నాడు. ఎందుకో మళ్ళా కాస్సేపాగి, "అదీ మంచిదే అయింది!" అన్నాడు నవ్వుతూ.

"ఏం?" కళ్ళు తిప్పుతూ అంది.

"మీ గురించి తెలుసుకొందికి చాలా ప్రయత్నించేను. రోజులు గడుస్తున్నాయి. కాని మీ గురించిన వూహలు తొలగేవికావు. నేను బియ్యే పాసయ్యేక మీరు దగ్గర లేకపోయారే అనే బాధే ఎక్కువ కలిగింది...."

ఆమె మాట్లాడకుండా వింటోంది.

"ఇంతలో ఉన్న ఊళ్ళో సర్వీసు కమిషన్ వాళ్ళు ప్రసాదించిన చిన్న ఉద్యోగం దొరికింది. అదే ఎంతో బలాన్నిచ్చింది. మీ ఊరు వద్దామనీ మీ నాన్నగారితో మాట్లాడదామనీ పిచ్చి పిచ్చిగా వచ్చేవి ఆలోచన్లు.... చూశారా, మీకు అంత ప్రమాదం తప్పిందో" అంటూ తన జోక్కి తనే నవ్వాడు.

ఆమె నవ్వలేదు "అలా అనుకుంటే ఎలాగ" అంది.

తను నవ్వేడు.

"నా గురించి మీకు తెలియకపోయినా, మీ గురించి నాకు ప్రభావతి ఉత్తరాల ద్వారా తెలిసేది". ఆమె మొదలెట్టింది "మీరు ఇంటర్ చదువుతున్న రోజుల్లోనే నా పెళ్ళి జరిగిపోయింది. చాలా తమాషాగా ఓ కథలాగ అయిపోయింది. పదే పది రోజుల్లో వలఆయన చూడ్డం, నేనునచ్చడం-అంతే పెళ్ళి జరగడం - పెళ్ళి కార్డులు వేయించడానికి కూడా టైము లేకపోయింది. ఈయన తెలుసుగా, అప్పట్లో కొత్తగా ఐ. ఎ. ఎస్. అయ్యేరేమో—ఏడాదికో వూరు బదిలీలు—అన్నీ వూళ్ళు తిప్పారు. చాలా ఏళ్ళు ఢిల్లీలో వుండిపోయాం. ఇక్కడికి రాడం ఢిల్లీనించేగా" అని కొంచెం ఆగి,

"ఆ....ఇంతకీ మీ ఆవిడ, సమంగా చూసుకుంటుందా మిమ్మల్ని?" ఆ ప్రశ్న వెనకాల ఉన్న ఆప్యాయతకి తానెంతో కదలిపోయాడు.

"చాలా మంచిది!"కృతజ్ఞత నుట్టిపడుతుండగా అన్నాడు.

"ఎంతమంది పిల్లలు?"

"ముగ్గురు!"

"చాల లేదా?"

విస్మయం చెంది చూశాడు ఆమెకేసి. చిన్నగా ఆమె పెదాలపై ఓ నగిషీ నవ్వు మెదిలింది.

"ఉండండి, ఇప్పుడే వస్తాను. లోపలికి వెళ్ళింది.

తిరిగి వస్తున్న ఆమె చేతిలో పోస్టు ముద్రలుపడి నలిగిన ఓ కవరు అదేమిటో అర్థమయ్యేలోగా తన చేతిలో పడింది. ఆ కవరు. ఎడ్రస్ చూస్తే "తనదే" తన భార్యచేతివ్రాతదే. వెంటనేగుర్తుకొచ్చింది. ఆ క్రితంరోజు పద్మ నోట్సు దిద్దడానికి ఇంటికి తీసికెళ్ళాడు. రాత్రి దిద్ది ప్రొద్దున్న ఆఫీసుకి వెళుతూ తొందర్లో. లోపల తన కవరుంచిన సంగతి మర్చిపోయి ఇక్కడ ఆ నోట్సు ఇచ్చి ఆఫీసుకి వెళ్ళిపోయాడు.

చూశాడు. కవరు తిరిగి అంటించిఉంది. తను విప్పబోతుండగా ఆమె అంది.

"ప్లీజ్! ఇంటికె వెళ్ళి పోస్టు చేయండి."

తనకి అర్థం అయింది.

అవును మరి! ఎంత సున్నితమైన విషయం!

* * *

"డియర్ రామం!

నీతో మాట్లాడడానికి నాకు వీలవుతుందనుకోను. ఎన్నో మాటలు. మన మధ్య ఎన్నో గీతలు. ఎప్పటికీ దాటలేం. దాటాలనుకోవద్దు కూడా. మీ ఆవిడ ఉత్తరం చదివేనోయ్! నీకు కొంచెంకూడా బుద్ధిలేకపోయిందేమని అడుగుతున్నాను. ముగ్గురు పిల్లల్ని కని, చాలనట్లు ఇంకా కంటున్నావు. ఆమె పరిస్థితి పుట్టింట్లో ఎంత ఘోరంగా వుందో ఆమె ఉత్తరంలోని ఏ మూడు లైన్లు చదివినా అర్థం అవుతుంది.

"నే చెప్పినట్టు వింటావా! ఇదిగో ఇందులో అయిదు వంద కాగితా లుంచాను. ఈ సొమ్ముతో వెంటనే ఆమె దగ్గరకు వెళ్ళి తిరుగు ట్రెయిన్‌లో ఆమెను, పిల్లలను తీసుకొని వచ్చేయ్. ఉన్నదాంతో ఉన్న పిల్లల్తో కులాసాగా ఉండే ఏర్పాటు తొందరగా చేసుకో.

నా చొరవకు క్షమించు.

నీ చిన్ననాటి నేస్తం—

"ముగ్గురు పిల్లలు" అని తాను అన్నాక "చాల్లేదా?" అని అడగడంలో బయట పడిన ఆమె కొంటె నవ్వు గుర్తుకొచ్చింది రామారావుకి. ★




## ఆల్ ఇండియా పాప్యులారిటీ పోటీ

(అమ్మకము పెంచుట కొరకు పథకం)

మొత్తం 82 గల నమూనా

| | | | |
|---|---|---|---|
| 19 | 24 | 17 | 22 |
| 28 | 13 | 26 | 15 |
| 21 | 20 | 23 | 18 |
| 14 | 25 | 16 | 27 |

మొదటి బహుమతి: మొత్తం సొల్యూషన్ సరియైనది అయినచో ఒక వెయ్యి నగదు. రెండవ బహుమతి: పై మూడు అడ్డ వరుసలలో సరియైనది అయినచో అయిదు వందలు నగదు. మూడవ బహుమతి: సోని సూపర్ డీలక్స్ 3 బ్యాండ్ ట్రాన్సిస్టరు 250 లేదా ఎక్కువ ఎంట్రీదారులకు ధర: 270/-లో సగం ధర.

నిబంధనలు: 1. ఖాళీ కాగితముపై 14 నుండి 29 వరకుగల అంకెలను ఒకేసారి ఉపయోగించి ఎటుకూడినా మొత్తం 86 వచ్చునట్లు వేయాలి. 2. సీల్డు సొల్యూషన్ మా కార్యాలయమునందుంచబడినది. అది ఎమ్. డి. చే స్వయంగా తెరువబడును. 3. ఈ పోటీకి ఎంట్రీ ఫీజు లేనందువల్ల మొదటి మరియు రెండవ బహుమతులు మా సీల్డు సొల్యూషన్‌తో సరిపోయినప్పుడు మాత్రమే ఇవ్వబడును. అట్లు లేనియెడల మొదటి. రెండవ బహుమతులుండవు. 4. మూడవ బహుమతి గెలుపొందినవారు పోస్టేజి ప్యాకింగ్, ఇన్సూరెన్సు, లెదర్ కేస్ ఖర్చులు మొదలయినవి చెల్లించాలి. 5. మూడవ బహుమతి గెలుపొందిన వారికి నగదు బహుమతులుండవు. 6. ఒక ఎంట్రీదారుడు ఒక ఎంట్రీ మాత్రమే పంపాలి. 7. వావాదేవీలు ఆలీఘర్ సివిల్ కోర్టునందు మాత్రమే. 8. ఎంట్రీలు హిందీ లేక ఇంగ్లీషులో మాత్రమే పంపాలి.

ముగింపు తేదీ : 24-11-77 ఫలితం : 26-10-77

MAYUR TRADERS (AJW-86) Jaiganj, ALIGARH-.

## ఐటెక్స్ - మాట్ ఫినిష్ తిలకము

నాణ్యతను పరిశోధించి వ్యత్యాసమును చూడండి

ఐటెక్స్ మాట్ ఫినిష్ (EYETEX MATT FINISH) తిలకము మీ మృదువైన చర్మమునకు సరియైనది. మీ అందమును ప్రజ్వలింపజేయును. అనేకమైన మంచి రంగులలో, చర్మమునకు హాని కలుగని మంచి సువాసన ద్రవ్యములతో చేయబడినది.

ఇది ఔషధములు మరియు అలంకార వస్తువుల యాక్ట్ మరియు రూల్స్ ప్రకారము - విజ్ఞాన పూర్వకముగా తయారుచేయబడినది.

ఒక్కొక్క ట్యూబులోను 50% ఎక్కువ తిలకము అదే ధరకు దొరకుటచే చాల చౌకైనది.







33 సంవత్సరముల అనుభవము వేరు విధముగ వుండుటకు వీలులేదు.

ARAVIND LABORATORIES MADRAS-600 033